

(క్రిందటి సంచిక నుంచీ కొనసాగింపు)

2024-జూలై

కాఫీ కప్పు ముందున్న టీపాయ్ పైన పెట్టింది భాను.

"అనూ, యేమంటున్నావు నువ్వు? రెండేళ్ళ స్నేహం! నీ చదువు పూర్తికాగానే అతనితో నీ పెళ్ళి చేయాలని కూడా అనుకుంటున్నాము. ఇప్పుడీ బ్రేక్ అప్ యేమిటి? స్థిమితంగా కూర్చొని చెప్పు." యెంత నిబ్బరంగా వుందామనుకున్నా ఆమె గొంతులో కంగారు.

"అవునమ్మా, నాకెందుకో అజహర్‌తో నేను పెద్దగా సుఖపడలేనేమో అనిపిస్తుంది. బహుశా నువ్వూ నాన్నా చెప్పిందే నిజమేమో!"

"ఆగు అనూ, తొందరపడి నిర్ణయాలు తీసుకోకు. బాగా ఆలోచించుకో!"

నవ్వింది అనూ.

"అమ్మా, చిత్రం చూడు. అజహర్‌ని పెళ్ళాడతానన్నప్పుడూ సరిగ్గా ఇదే మటన్నావు, నువ్వే కాదు, నాన్న కూడా."

భాను గిల్టీగా తలొంచుకుంది.

"అవును అనూ. అప్పుడామాట అన్నది నిజమే. అప్పుడు నీ నిర్ణయం తప్పని కూడా అనిపించింది నాకు. కానీ, ఇప్పుడూ రెండేళ్ళు కలిసి మెలిసి తిరిగి ఇప్పుడు వొదిలేస్తే అందరూ యేమనుకుంటారు!"

"అమ్మా, అందరూ యేమనుకుంటారో అన్నది తప్ప నీకింకేదీ కనిపించదా? నేనేం ఆలోచిస్తున్నాను, అసలు నా సమస్యేమిటీ అని ఎప్పుడైనా ఆలోచించావా?" అనఘ కోపంగా అడిగింది.

భాను ఒక్క క్షణం మౌనంగా ఉండిపోయింది. నిజమే,తాను అంత రియాక్ట్ అయే ముందు అనూ యేం ఆలోచిస్తుందో, దానికి ఎలా అనిపిస్తుందో అడక్కపోవడమూ, అర్థం చేసుకోకపోవడమూ తన తప్పే. నిట్టూర్చింది భాను.

"ఓకే అనూ! నువ్వన్నది నిజమే. నేనూ, మీ నాన్నా, చాలావరకు మా ఆలోచనలూ, మా ప్రయారిటీసూ, మా ఒత్తిళ్ళూ, వీటన్నిటిలో కొట్టుకొని పోతూ మిమ్మల్ని అంత సరిగ్గా అర్థం చేసుకోలేదేమో. దట్ డజ్ నాట్ మీన్ వీ ఆర్

నాట్ ఇంటరెస్టెడ్ ఇన్ యూ! చెప్పు. ఏం జరిగింది? ఎందుకు అజహర్ గురించి నీ అభిప్రాయంలో మార్పు వొచ్చింది. ఎటువంటి జడ్జ్‌మెంటూ లేకుండా వినే ప్రయత్నం చేస్తాను." శాంతంగా అన్నది.

అనూ మనసులో ఎన్నెన్నో చిత్రాలు కదిలాయి, అజహర్‌తో స్నేహమూ, సంభాషణలూ, వాదులాటలూ గుర్తొచ్చాయి. అమ్మతో చెప్పసాగింది.

★★★★★★★

అసలు ముందునించీ అజహర్ తనకెందుకు నచ్చాడు? కొన్నివిషయాల్లో తండ్రిలాగే ప్రవర్తిస్తే, కొన్నిసార్లు తండ్రికి మొత్తం వ్యతిరేకంగా ఆలోచిస్తాడు. రెండూ కూడా తనకి ఆకర్షణీయంగా అనిపించేవి మొదట్లో. కానీ అవే కొన్నిసార్లు తనని చిరాకు పెడుతున్నాయి. తన చిరాకులనీ, కోపతాపాలనీ అతను నవ్వుతూ డీల్ చేయడం తనకి చాలా సరదాగానే వుండేది. అందులోనూ తమ ఇంట్లో అమ్మా నాన్నలతో, అన్నయ్యతో ప్రతిదీ ఒక ఇంటెలెక్చువల్ చర్చలా అనిపించే వాతావరణంలో పెరిగిన తనకి, అతను ప్రతిదీ హ్యూమర్‌తో హేండిల్ చేయడం చాలా రిలాక్సింగ్‌గా అనిపించేది.

ఆ రోజుల్లో ఒకరోజు తను చాలా ఆవేశంగా తనకి నచ్చని యేదో సినిమా గురించి చెప్పింది. తన మాటలన్నీ ప్రశాంతంగా విని, "అది సరే, ఇంతకీ ఏమన్నా తిన్నావా లేదా?" అని అడిగాడు. ఆకాశంలో ఎగిరే తన ఊహలనీ, ఆలోచనలనీ, ఇంప్రాక్టికల్ బ్రతుకు పద్ధతులనీ అతను తన మామూలు మాటలతో, ప్రాక్టికల్ సూచనలతో న్యూట్రలైజ్ చేస్తాడనిపించేది. అందుకే అతని సమక్షంలో తనకి చాలా ప్రశాంతంగా, భద్రంగా అనిపించేది. కానీ, ముఖ్యమైన విషయాలు చర్చించాల్సినప్పుడు కూడా అతను తేలిగ్గా నవ్వు మాటలతో దాటేయడం ఒక పరిధికి మించి కష్టంగా వుంది. అది దాదాపు ఎస్కేపిజంలా గనిపిస్తూ వుంది ఈ మధ్య.

★★★★★

"ఈ చర్చ చేసి తప్పొప్పులు నిర్ణయించడం కంటే ఏదో జోక్ చేసి దాటేయడం– దాదాపు గేస్ లైటింగ్ లావుంది."

అంతా విన్న భాను, "గేస్ లైటింగ్ అంటే యేంటి అనూ?" అడిగింది

"గేస్ లైటింగ్ అంటే– మనం ఎంతో ముఖ్యమైన విషయాన్నో, సమస్యనో బయట పెట్టినప్పుడు, అవతల మనిషి మనవన్నీ అపోహలేననీ, ఊరికే ఊహించుకుంటున్నామనీ కొట్టి పారేయడం."

"హ్మ్మ.."

"ఉదాహరణకి మీ ఆఫీసులో ఎవరైనా నీతో మిస్–బిహేవ్ చేసారని నీ కనిపిస్తుంది. ఆ విషయం నువ్వు మీ బాస్‌కో, హెచ్–ఆర్‌కో కంప్లెయింట్ చేసావనుకో. అప్పుడు వాళ్ళు నీ సమస్యని కనీసం పూర్తిగా వినకుండా, అతను చాలా మంచివాడు, నువ్వే తప్పుగా వూహించుకుంటున్నావ్ అని నీ మాటలనీ, ఫీలింగ్స్‌నీ తీసి పడేస్తే ఎలా వుంటుంది?"

"అయితే అజహర్ అలా నీ మాటలకి విలువివ్వకుండా తీసి పడేస్తున్నాడా?"

"తీసి పడేయడు కానీ, నవ్వులాట కింద మారుస్తాడు."

"ఆ పద్ధతి నీకు నచ్చట్లేదని అతనికి ఎప్పుడైనా చెప్పావా?"

"చెప్పాను. ప్రతీదీ అంత సీరియస్‌గా తీసుకోకు. కొంచెం తేలిగ్గా తీసుకునే అలవాటు వుండాలి అంటాడు. అసలు కిందటి వీకెండ్ అయిన గొడవతో నాకు చాలా కన్‌ఫ్యూషన్ మొదలైంది."

"ఏం జరిగింది?"

★★★★★

ఆ రోజు ఇద్దరూ అజహర్ కుటుంబంతో కలిసి లంచ్‌కి వెళ్ళారు. అందరూ సరదాగానే మాట్లాడారు. అజహర్ బాబాయి మాత్రం ఒకటే పుట్టబోయే పిల్లల్ని యే మతం ప్రకారం పెంచుతారు, అంటూ ప్రశ్నల మీద ప్రశ్నలేసి చంపాడు. అనఘ ఘాటుగా జవాబిద్దామనుకుంది, మీకెందుకండీ, అని. అజహర్ మాత్రం టాపిక్ మారుస్తూ, జోకులేస్తూ, ఆయన ప్రశ్నలు విననట్టు నటిస్తూ దాటేసాడు. భోజనం చేసినతరవాత అజహర్ కార్లో అడిగాడు–

"అదోలా వున్నావేం అనూ? అసలు నువ్వు భోజనం సరిగ్గా చేయనేలేదు. మా అమ్మ నీకోసమని పక్కింటి ఆంటీని బ్రతిమాలి పులిహోర చేయించింది. అయినా నువ్వు సరిగ్గా తిననేలేదు."

"నో, నో! సరిగ్గానే తిన్నా అజహర్."

"యేమిటి తినడం? పళ్ళెంలో కెలుకుతూ కూర్చున్నావు. నేను చూస్తూనే వున్నా. సరిగ్గా తినవు, మళ్ళీ ఆకలితో తలనొప్పని యేడుస్తావు," నవ్వాడు అజహర్.

ఒక్క క్షణం మనసంతా వెచ్చగా అయింది అనూకి. తనని గురించి యెంత ఆలోచిస్తాడు! తన ఇష్టాఇష్టాలు తెలుసుకోవడానికి శ్రద్ధగా ప్రయత్నిస్తాడు. నెల రోజుల కింద, మధ్యాహ్నం యెండలో తన స్కూటీ పాడయిందని ఫోన్ చేస్తే, యాభై కిలోమీటర్ల దూరంలో వున్నా, ఒక మెకానిక్కునీ, మంచినీళ్ళ బాటిలూ పట్టుకొచ్చాడు. ఆ ఆపేక్షా, అక్కరా తనకెంతో ఇష్టం, కానీ యే విషయాన్నీ పెద్దగా లెక్కలోకి తీసుకోకపోవడం, తప్పించుకోని తిరగడం, అది మంచి పద్ధతేనా? యెప్పటికైనా మనిషన్న వాడు ఒక స్టాండ్ తీసుకోని ధైర్యంగా మాట్లాడాల్సిన రోజు వొస్తుంది. ఆ రోజూ ఇలాగే మాట దాటవేస్తే?

"అదిగో మళ్ళీ ఆలోచనల్లోకి జారిపోతున్నావ్. ఇందాకటి నించీ నేను నా కష్టమర్ల గురించీ మొత్తుకుంటూ వుంటే నువ్వు కిటికీలోంచి బయటికి చూస్తూ కుర్చున్నావు. చెప్పు, వాట్ ఈజ్ బాదరింగ్ యూ?"

"అది కాదు అజహర్, నువ్వెందుకు ఎవరైనా మనని వేళాకోళం చేసినా, హర్ట్ చేసినా దులిపేసుకుంటావు? తిరిగి ఒక్క మాటతో వాళ్ళ నోరు మూయించొచ్చుగా? రేపు మన పెళ్ళయిన తరవాత కూడా నువ్విలా మెత్తగా, యే విషయమూ సీరియస్‌గా తీసుకోకుండా వుంటే ఎలా?"

ఆశ్చర్యపోయాడు అజహర్.

"అవునా? ఇప్పుడు నేను యెవరితో గొడవ పెట్టుకోవాలి? యెందుకని?"

"మీ అంకుల్ ఎంత చిరాగ్గా మాట్లాడాడు ఇవాళ? నువ్వు కొంచెం ఆయనని ఆపుతావేమో అని చూసాను! అదేదో పెద్ద జోకైనట్టు, నవ్వుతూ, ఇంకా పైన జోకులేస్తూ! అసలు సీరియస్‌నెస్సే వుండదా నీకు?"

"యెప్పుడో పుట్టబోయే పిల్లల గురించి ఆయన యేదో పిచ్చి మాటలు మాట్లాడితే, అవన్నీ మనసుకి ఎక్కించుకొని దాని గురించి వాదించాలా? అబ్సర్డ్!"

"నువ్వు ఆపకపోతే ఆయన ఇంకా అలా మాట్లాడుతూనే వుంటాడు."

"అప్పుడు ఆపొచ్చులే."

"అయినా మన పిల్లల పెంపకం మీద ఆయన కామెంట్లేమిటి?"

మళ్ళీ నవ్వాడు అజహర్.

"ఇంకా పుట్టని పిల్లల గురించి మా మామ తో దెబ్బలాట పెట్టుకోవాలి. అంతేనా?"

"సరే, అతని మాట పక్కన పెట్టు. మన సంగతి చెప్పు, పిల్లలు యే మతం ప్రకారం పెరుగుతారు? మీ వాళ్ళు మతం మారమంటే పిల్లలు యేం చేయాలి?"

"అనూ, మా అమ్మా నాన్నా నిన్నే మతం మారమన లేదు. పిల్లల్ని అంటారా?" ఈసారి విసుగ్గా అన్నాడు.

"ఇప్పుడు అనలేదు సరే, ఇక ముందు మీ మామయ్య లాటి వాళ్ళ మాటలు విని అంటే?"

"ఎప్పుడో రాబోయే సమస్యకి ఇప్పుడేం చేద్దాం? జస్ట్ కాం డవున్!" వున్నట్టుండి చాలా అలిసిపోయిన వాడిలా అన్నాడు. ఆమె యేమీ మాట్లాడ లేదు కానీ భవిష్యత్తు గురించిన ఆందోళన యేదో చుట్టు ముట్టింది.

★★★★★★★★★★

"నాన్న ప్రతీ విషయాన్నీ ఎంత లోతుగా చర్చిస్తారు! అసలు అజహర్‌కి అంత డెప్త్ లేదేమో అనిపిస్తూ వుందమ్మా!" భానుకి నవ్వొచ్చినా, నవ్వలేదు. కూతురి మాటలన్నీ ఓపిగ్గా విన్నది. మొదటిసారి ఆమెకి పిల్లల మాటలు వింటూ, మాటి మాటికీ అడ్డు పడకుండా వుండడం ఎంత కష్టమో తెలిసింది. అయినా మనసుని ఉగ్గబట్టుకొని మౌనంగా విన్నది. అనూ మాటల్లో నిజం లేకపోనూ లేదు.

సంఘంలోనూ, దేశంలోనూ రకరకాల అస్తిత్వ వాదాలూ, ఇంతకు ముందు లేని సరిహద్దు గీతలు వర్గాల మధ్య పుట్టుకొస్తున్నాయి. ఇవన్నీ తట్టుకుంటూ వీళ్ళ సంబంధమూ, ప్రేమా నిలబడగలవా?

"అయితే, ఇప్పుడు ఏం చేద్దామనుకుంటున్నావ్?"

"అదే అర్థం కావడం లేదు. కొన్నిసార్లు అజహర్‌ని చాలా అన్యాయంగా విమర్శిస్తున్నానా అనిపిస్తూ వుంది. పాపం అతని తప్పేమీ లేదు!"

"ఇద్దరు మంచి వాళ్ళకి మధ్య సంబంధం బాగుండాలని రూలేమీ లేదు."

"ఐ కాంట్ అండర్‌స్టాండ్ అమ్మా! ఇంతకీ నేనేం చేయాలని నీ సలహా?"

"ఐ హేవ్ నో ఐడియా! అతనితో మాట్లాడుతూ, నువ్వూ ఆలోచించుకో!" తన కుర్తా అంచులు సాపు చేస్తూ మౌనంగా కూర్చుంది భాను.

పిల్లలకే సమస్య వొచ్చినా, తీర్చాల్సిన బాధ్యత తన మీదే వుందనుకునే సగటు తల్లి ఆమె. మొదటిసారి, పిల్లలు పెద్దవాళ్ళయ్యారనీ, వాళ్ల సమస్యలగురించి వాళ్లు ఆలోచించుకోవాలనీ ఆమెకి అర్థమయింది. చిన్నబోయిన అనూ మొహం చూస్తే, అంతలోనే తల్లి హృదయం కరిగిపోయింది.

"అనూ. ఒక్క విషయం ఆలోచించు. మీ ఇద్దరి జీవితంలో ఏ ఊహ నిన్ను భయపెడుతుంది? మీ ఇద్దరి ఆలోచనల్లో, పద్ధతుల్లో వున్న తేడానా? లేక నువ్వు వాదించే ఓపికలేక అతనిలానే అయిపోతవన్న భయమా?"

"అదే నాకూ తెలియడంలేదు. ప్రతీ దాని గురించి అకడెమిక్ చర్చలు చేస్తాడని నాన్నని గురించి నేనూ అన్నయ్యా నవ్వుకునేవాళ్లం. కానీ నాన్నకి పూర్తి ఆపోజిట్‌గా వుండే అజహర్ కూడా..."

"అనూ, ప్రతీ విషయాన్ని గురించి చర్చలు చేయడని అజహర్ వ్యక్తిత్వాన్ని తక్కువ అంచనా వేస్తున్నావేమో. ప్రశ్నించే మనస్తత్వం లేకుండానే తన మతం కాని నిన్ను పెళ్ళి చేసుకోవాలని నిర్ణయించుకున్నాడా? ఆలోచించు." భాను కాఫీ కప్పులు తీసుకొని లేచింది లోపలికెళ్ళడానికి.

అనూకి నచ్చచెప్పి ఈ పెళ్ళికొప్పించడం తేలిక. లేదూ ఇదే అవకాశంగా ఈ మతాంతర వివాహం నించీ తప్పించుకోవడమూ తేలికే. కానీ ఆమెకి కావాల్సింది ఆ రెండూ కాదు. తన బిడ్డ సుఖమూ, సంతోషమూ.

"అనూ, నీ అనుమానాలు యేవైనా, వాటిని ఇగ్నోర్ చేయకు. వాటిని తీర్చుకోవడానికే ప్రయత్నించు. ఆఖరికి నీ నిర్ణయం ఏదైనా, నాకూ నాన్నకి ఎటువంటి అభ్యంతరమూ వుండదు." అనూ మౌనంగా ఆలోచనలో మునిగిపోయి బాల్కనీ బయటికి చూస్తూ వుంది.

"అజహర్ నీకు నచ్చడమూ నిజమే, కొన్ని విషయల్లో అతను తన బ్రతుకుని నడుపుకునే పద్ధతి నీకు నచ్చకపోవడమూ నిజమే. రెండు పరస్పర విరుద్ధమైన విషయాలు కలిసి వుండడం అంత పెద్ద వింతేమీ కాదు. నువ్వు తేల్చుకోవాల్సింది ఈ రెండు విషయల్లో ఏది నీకెక్కువ ముఖ్యం అన్నది. ఆ నిర్ణయం నువ్వు తప్ప ఇంకెవరూ తీసుకోలేరు."

"ఇంతగా నాకు ఇష్టమైన అజహర్‌ని నేను భరించలేని రోజు వస్తే? అతను మారిపోతే? నాకు భయంగా వుందమ్మా!"

"అతనే కాదు, నువ్వూ మారొచ్చుగా? నిన్ను కన్న వాళ్ళం, నేనూ నాన్నా నీకు నచ్చకుండా మారొచ్చుగా? అలా జరిగే అవకాశం యే రిలేషన్‌షిప్‌లో నైనా ఎంతో కొంత వుంటుంది. అందుకని ముందు రాబోతున్న బ్రతుకునంతా

ఇప్పుడే ఊహించేసుకొని ప్లాన్ చేసుకోలేం కదా? అది జరిగినప్పుడు, అప్పుడు మన ప్రయారిటీస్ ఆలోచించుకొని ఆ సంబంధం కొనసాగించడమా, వొదిలేసుకోవడమా అన్న నిర్ణయం తీసుకుంటాం."

"లైఫ్ ఇంత కాంప్లికేటెడ్‌గా ఎందుకైంది?"

"మీ నాన్ననడిగితే లక్ష కారణాలు చెప్తాడు. నాకైతే మనిషికి ఆప్షన్‌లు ఎక్కువవడం వల్ల బ్రతుకులో కొంచెం సంక్లిష్టత వొచ్చిందనిపిస్తుంది."

"సంక్లిష్టత అంటే?"

"ఇందాక నువ్వన్నావు కదా– అదే, కాంప్లికేటెడ్."

★★★★★★★★★

2024-డిసెంబర్

అర్ధరాత్రి దాటినా కళ్ళు మూతపడటంలేదు భార్గవకి. ఏదో నోటిఫికేషన్ రావడంతో మొబైల్ ఫోన్ టింగుమంది. ఫోన్ తీసి చూడాలంటే భయం వేసిందతనికి. ఈ భయం ఎప్పుడు మొదలైందో కూడా గుర్తులేదతనికి. ఆర్నెల్ల కిందట, అంతకు ముందేనా? కడుపులోంచి ఏదో భయం జరజరా గుండెల్లోకి పాకినట్టయి మంచం మీద పడుకోలేక లేచి కుర్చీలో కూలబడి లేప్ టాప్ తెరిచాడు.

ఎప్పుడు, ఎక్కడ మొదలైందీ పతనం? ఆరాటంగా స్ప్రెడ్‌షీట్ తెరిచి అంకెలని పరిశీలించడం మొదలు పెట్టాడు. తను ఎప్పుడెప్పుడు యే ఆటల్లో పెట్టుబడి పెట్టాడూ, యెంత గెల్చుకున్నాడూ, అన్నీ వివరంగా అంకెలు వేసి పెట్టుకున్న స్ప్రెడ్‌షీట్. దాన్ని తన బేంక్ అక్కవుంట్‌తో పోల్చుకొని చూసుకుంటాడు క్రమం తప్పకుండా.

దాదాపు ఎనిమిది నెలల క్రితం మొదలైంది, అప్పుడప్పుడూ తన అంచనాలు తప్పి డబ్బు నష్టపోవడం. మొదటి పది పదిహేను ఎంట్రీలన్నీ దాదాపు తను గెలిచినవే. సుధీర్‌తో కాఫీ తాగుతూ కాంఫిడెంట్‌గా చర్చించాడు కూడా– తనెందుకు యే టీం మీదా, యే ప్లేయరు మీదా పందెం కాసిందీ, యెందుకు ఆ టీం నెగ్గి తీరుతుందీ, వాతావరణమూ, గాలిలో తేమా, ఆటగాళ్ళ నైపుణ్యమూ కలిపిన తన ఎనాలిసిస్! ఆరేడు నెలల వరకూ బాగానే డబ్బు సంపాదించుకున్నాడు. ఇంకొన్నాళ్ళు ఇలాగే కొనసాగించి వచ్చిన డబ్బు ఇంకేదైనా బిజినెస్‌లో పెడదామనుకున్నాడు. అజహర్ వాళ్ళ కుటుంబం చేసే బిజినెస్ గురించి అతనితో మాట్లాడాడు కూడా.

అప్పుడు మొదలైంది, అప్పుడప్పుడూ తను డబ్బు నష్టపోవడం. తన అంచనా అంతలా తప్పడం చూసి ఆశ్చర్యపోయాడు. కొన్నిసార్లు పోగొట్టుకున్న డబ్బు మళ్ళీ జరిగిన పందాల్లో సంపాదించుకున్నాడు. అన్ని వ్యాపారాల్లోనూ అప్పుడప్పుడూ నష్టపోవడం సహజమే, అని తనకి తానే సర్ది చెప్పుకుని మళ్ళీ ఇంకా శ్రద్ధగా పరిశీలించి డబ్బు పెట్టాడు. అయితే, వచ్చే డబ్బు తక్కువా, పోయేది యెక్కువా అవడం మొదలైంది.

అప్పటికైనా తను మేలుకొని వుంటే బాగుండేది. ఒకలాటి ఉక్రోషమూ, తెగింపుతో డబ్బు అప్పు తెచ్చి మరీ ఆటల్లో పందాలు కాసాడు. కొన్ని సార్లు అప్పు తీర్చాడు, కొన్ని ఇంకా తీర్చలేదు.సుధీర్ తన ఫోన్ యెత్తడమే మానేసాడు.

కళ్ళు తుడుచుకున్నాడు భార్గవ్.

మొదట్లో తన అంచనాలు తప్పి డబ్బు పోగొట్టుకున్నప్పుడు ఆశ్చర్యపోయినా, స్టాటిస్టికల్ చాన్స్ అనుకున్నాడు. కానీ, మళ్ళీ మళ్ళీ అదే జరగడంతో కొంచెం విస్తుపోయాడు. ఆన్‌లైన్ ఫోరంలు వెతికాడు. రహస్యాలూ, పుకార్లూ వినపడ్డాయి.నిజ జీవితంలో జరిగే మాచ్ ఫిక్సింగుల్లా ఇక్కడా జరుగుతూ వుంది.దాన్ని ఎలా పట్టుకోవాలో, ఎవరికి ఫిర్యాదు చేయాలో అర్థం కాలేదు.

మొదటిసారి డబ్బు అవసరమైనప్పుడు తను రెండో పొరపాటు చేసాడు. లోన్ యాప్స్! అమ్మా నాన్నల తరంలా బాంకు లోన్ కావాలంటే ముప్పుతిప్పలు పడక్కర్లేదు. గంట సేపట్లో తేలిగ్గా లోన్ దొరికింది. వడ్డీ రేట్లు చూసి కొంచెం భయం వేసినా తనెలాగూ తీర్చేస్తాడు కాబట్టి, పెద్దగా పట్టించుకోలేదు. చిన్న చిన్న అప్పులు తీర్చే ప్రయత్నం చేసాడు. కానీ, ఇప్పుడు మోయలేనంత బరువు పడింది.

డబ్బు కట్టడం ఆలస్యమైనప్పుడు లోన్ యాప్స్ నించి వచ్చే ఫోన్లూ, మెసేజీలు ముందు సౌమ్యంగానే వుండేవి. కానీ గత వారం రోజుల నుంచీ అంత సౌమ్యంగా లేవు. హెచ్చరికలూ, బెదిరింపులూ, తనకి అలవాటు లేని మొరటు ప్రపంచపు భాషా! ఇంట్లో అమ్మా–నాన్నా, చెల్లీ తనూ డైనింగ్ టేబుల్ దగ్గర చూసే ప్రపంచానికీ, ఆ లోన్ యాప్స్ వాళ్ళు చూపించే ప్రపంచానికీ అసలూ యే పోలికా లేదు.

తన చిన్న డైరీ తీసి అందులో అంకెలు వేయడం మొదలు పెట్టాడు. తనకున్న అప్పులు, బేంకులో వున్న డబ్బూ! అంకెలు చూసి అతని గుండె గుభిల్లుమంది. ఇంత అప్పు యెలా తీరుస్తాడు?

బయట అడుగుల చప్పుడైంది. అమ్మ కాబోలు. తన గదిలో ఇంకా లైట్ వెలుగుతూ వుండడం చూసి చెక్ చేయడానికి వొస్తుందేమో. అతనికి అమ్మని తలచుకోగానే గుండెల్లో నొప్పిలా అనిపించింది. ఒక్కసారి అమ్మకి చెప్తే? కుర్చీలోంచి లేచాడు. ముందు కోప్పడ్డా అమ్మ యేదో దారి చూపిస్తుంది. కుర్చీలోంచి లేచి తలుపు వైపు నడిచాడు. అడుగుల చప్పుడు దూరమై పోయింది. ఆ బలమైన, బలహీనమైన క్షణం చేతుల్లోంచి జారిపోయింది.

మళ్ళీ టేబిల్ దగ్గరికి వెళ్ళి కుర్చీలో కూలబడ్డాడు. చేతుల్లో మొహం దాచుకున్నాడు. ఆ క్షణంలో అతనికి అన్నిటికన్నా భయంకరంగా అనిపించిన విషయం– లోన్ రికవరీ ఏజెంట్లు అమ్మకి ఫోన్ చేయడం! పిచ్చి అమ్మ. తను బాడ్‌మింటన్ ఆటల గురించీ, టెక్నిక్కుల గురించీ ప్రశ్నలు అడిగినప్పుడు తనకి ఆ ఆట మీద ఆసక్తి వుందనుకోని సంతోషపడిపోయింది. తనని కోర్టుకి తీసుకెళ్ళి ఆట నేర్పించింది కూడా. తను

తన గురించి తెలిస్తే అమ్మా నాన్నా యేమవుతారు? హాయిగా సినిమాలు చూసుకుంటూ, చేయబోయే సినిమాల గురించి కలలు కంటూ, వాటిని అందరితో పంచుకుంటూ సంతోషంగా తిరిగే తను ఈ ఊబిలో ఎలా ఇరుక్కున్నాడు? ఆట గురించి అడిగింది ఇందుకోసమని తెలిస్తే తట్టుకుంటుందా?

యే మొహం పెట్టుకొని ఇంట్లో వాళ్ళ మొహం చూడగలడు తాను? తన లెక్చర్లూ, యూనివర్సిటీనే ప్రపంచంగా బ్రతికే తండ్రీ, అనుక్షణం తననీ చెల్లెల్నీ రెక్కల కింద పొదువుకోవాలనుకునే తల్లీ, పైకి యేదీ పట్టనట్టున్నా, తన బాగు కోసం తాపత్రయపడే చెల్లీ, వీళ్ళందరూ తను చేసిన పనికి తలెత్తుకోలేరు. తనకి బ్రతికే హక్కూ, వాళ్ళని బాధ పెట్టే హక్కూ లేదు. ఓకే, ఐ విల్ పుట్ ఎన్ ఎండ్ టు దిస్, అనుకున్నాడు. ఒక నిర్ణయానికొచ్చాక అతనికి మనసు తేలికపడింది.

★★★★★★★★★★★

భాను కంప్యూటర్ ఆఫ్ చేసి బాగు తీసుకొని లేచి ఆఫీసు బయటికొచ్చింది. తన కారు వైపు నడవసాగింది. వున్నట్టుండి ఎదురుగా వొస్తున్న అజహర్‌ని చూసి ఆశ్చర్య పోయింది.

"హలో ఆంటీ!"

"హలో అజహర్! ఇక్కడ నువ్వేమిటి?"

"మీకోసమే వొచ్చాను ఆంటీ. నా కారులో వెళ్దాం, పదండి." అతను ఆమె చేతిలోని లంచ్ బాగ్ అందుకోని వెనుదిరిగాడు.

"ఎందుకు? ఏమయింది?" ఒక్క క్షణం భాను గుండె వేగం పెరిగింది.

ఊపిరి పీల్చుకొని ఆమె వైపు తిరిగాడు అజహర్.

"ఆంటీ! భార్గవ్‌ని హాస్పిటల్లో చేర్పించాను. హీ ఈజ్ నాట్ వెల్!"

"వాట్? ఏమయింది? భార్గవ్ కేమయింది?" తన గొంతు అంత పెద్దగా కారిడార్లో వినపడాల్సిన రోజు వొస్తుందని భాను ఊహించనేలేదు.

★★★★★★★★★

(కొనసాగింపు వచ్చే నెలలో)

COMMENTS